
# ముఖ్యమైన బైబిల్ సంఘటనల పరిశీలన

## ప్రధాన సంఘటనలను మరియు విషయాలను సూచించే గుర్తులను జ్ఞాపకం ఉంచుకోవడం ద్వారా బైబిల్ చరిత్రను ఒక వరుస క్రమంలో గుర్తుంచుకోవచ్చు




**1. సృష్టి :** ఆదికాండం 1-2 అధ్యాయాలు. దేవుడు భూమ్యాకాశాలను సృష్టించాడు. ప్రతి విషయం మంచిగా కనబడింది. మొదటి మానవులైన ఆదాము, హవ్వలు దేవునితో ఎంతో చక్కటి సహవాసాన్ని అనుభవించారు.




**2. తొలిపాపము :** ఆదికాండం 3. పాము ఆకారములో ఉన్న సాతాను ఆదాము హవ్వలను శోధించాడు. వారు పాపంచేసి ఈ సృష్టి మీదికి శాపాన్ని తీసుకువచ్చారు.




**3. జలప్రళయం :** ఆదికాండం 6-9. మానవులలో పాపమెంతగా ప్రబలి పోయిందంటే దేవుడు వారిని నీటిలో ముంచేశాడు. కాని ఒక పెద్ద ఓడలో నోవహును అతని కుటుంబాన్ని ఉంచి వారిని రక్షించాడు.




**4. బాబేలు గోపురం :** ఆదికాండం 11. మనుషులు విస్తరించి అభివృద్ధి చెందారు గర్వంతో ఆకాశాన్నంటే గోపురం కట్టాలనుకున్నారు. దేవుడు వారి భాషలను తారుమారు చేశాడు. ఫలితంగా అనేక జనాంగాలు మరియు దేశాలు ఏర్పడ్డాయి.




**5. అబ్రాహాముతో దేవుని నిబంధన :** ఆదికాండం 12 మరియు 15. అతని సంతానము ద్వారా అన్ని జనాంగాలను ఆశీర్వదిస్తానన్న దేవుని వాగ్దానాన్ని అబ్రాహాము నమ్మాడు.



**6. ఐగుప్తులో బానిసలు :** నిర్గమకాండం 1-18. అబ్రాహాము సంతానములో తర్వాతి తరాల వారు "పిరమిడ్"లు ఉన్న దేశానికి వలస వెళ్ళారు. అక్కడ వారు అభివృద్ధి చెంది విస్తరించారు. కాని బానిసలుగా వెట్టి చాకిరి చేస్తూ శ్రమపడ్డారు.



**7. పస్కా గొర్రెపిల్ల రక్తము :** నిర్గమకాండం 12-15. దేవుడు పంపిన తెగుళ్లవల్ల ఐగుప్తు రాజు ఇశ్రాయేలీయులను వదిలి పెట్టాడు. రక్తపు గుర్తులేని ఇండ్లన్నింటిలో ప్రథమ సంతానాన్ని ఒక దూత సంహరించాడు. దేవుడు ఎర్రసముద్రాన్ని రెండు పాయలుగా చేశాడు. బానిసలు ఐగుప్తీయుల సైనాన్ని తప్పించుకొని వెళ్ళిపోయారు.



**8. ఇశ్రాయేలీయుల ధర్మశాస్త్రం :** నిర్గమకాండం 18-20. సీనాయి పర్వతము మీద దేవుడు రెండు రాతి పలకల మీద వ్రాయబడిన ధర్మశాస్త్రమును మోషేకిచ్చాడు. ఇశ్రాయేలీయులు దానిని అతిక్రమించారు. ఫలితంగా వారు 40 సం॥ల పాటు అరణ్యంలో అటుఇటు తిరిగారు.




9. **ఇశ్రాయేలీయుల వాగ్దాన భూమిని జయించుట**: యెహోషువా గ్రంథం. అబ్రాహాము వంశస్థులకు, ఇశ్రాయేలీయులకు యిచ్చుటకు దేవుడు వాగ్దానం చేసిన కానాను భూమిని జయించుటకు యెహోషువ ఇశ్రాయేలు సైన్యమును నడిపించెను.



**10. న్యాయాధిపతుల పరిపాలన :** న్యాయాధిపతుల గ్రంథం : ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్రానికి అవిధేయులైనప్పుడు? దేవుడు వారిని అన్యజనుల చేతికి అప్పగించ్చాడు. అన్యులు వారిని అణచివేసారు. వారు పశ్చాత్తాపపడి దేవుని వైపు తిరిగినప్పుడు ఆయన వారిని విడిపించడానికి న్యాయాధిపతులను పంపించాడు. న్యాయాధిపతులంటే ఆయన ఆజ్ఞకు లోబడే వీరులు.



**11. రాజుల పరిపాలన :** 1 మరియు 2 సమూయేలు గ్రంథాలు. దావీదు మరియు సొలొమోను మొదటి రాజులు. వారు ఇశ్రాయేలు శత్రువులను ఓడించి రాజ్యాన్ని అభివృద్ధిలోకి తెచ్చారు. అతని సంతానం నుండి ఒకరు నిత్యం రాజ్యమేలుతారని దేవుడు దావీదుతో ప్రమాణం చేశాడు.




**12. రాజైన సొలొమోను యొక్క ఆలయం :** 1 రాజులు గ్రంథం దేవుడు తన సన్నిధినుంచడం ద్వారా క్రొత్త దేవాలయాన్ని ఆశీర్వదించాడు. ప్రజల పాపాలకు ప్రాయశ్చిత్తం చేయడానికి యాజకులు జంతువుల రక్తాన్ని బలిగా అర్పించేవారు.



**13. విభజించబడిన రాజ్యం :** 1 రాజులు 12. ఇశ్రాయేలీయులలోని 12 గోత్రాలవారు కలహించుకొన్నారు. 10గోత్రాలు కలిసి ఉత్తరాన ఇశ్రాయేలు దేశంగా ఏర్పడితే మిగిలిన రెండు గోత్రాలవారు దక్షిణాన యూదా దేశంగా ఏర్పడ్డారు రెండు దేశాలవారు రానురాను బలహీనపడి విగ్రహారాధన చేయడం మొదలుపెట్టారు.


**14. చెరపట్టబడుట :** 2 రాజులు 25. దేవుడు ఇశ్రాయేలీయులను హెచ్చరించడానికి ప్రవక్తలను పంపించాడు. కాని వారు తిరుగుబాటు చేశారు. కాబట్టి అన్యదేశస్థులు వారిని చెరపట్టుకొని పోవడానికి ఆయన అనుమతించాడు.






**15. పునర్నిర్మాణం :** ఎజ్రా గ్రంథం దేవుని ప్రజలు పశ్చాత్తాపపడ్డారు దేవుడు వారిని తిరిగి రప్పించాడు. వారు యెరూషలేం గోడలు తిరిగి కట్టారు. ఈ సమయానికి చెందిన చిట్టచివరి పాతనిబంధన గ్రంథాన్ని మలాకీ రచించాడు.

**16. విదేశీశక్తుల అధికారం :** కొన్ని శతాబ్దాలపాటు పర్షియా, గ్రీకు సిరియా మరియు రోమ్ దేశాలు ఇశ్రాయేలు వారిని తమ పాలన క్రింద పీడించి అధిక మొత్తాలలో పన్ను వసూలు చేశారు. ఆ సమయంలో బైబిల్‌లోని ఏ పుస్తకాలు వ్రాయబడలేదు.





**17. యేసు జన్మం మరియు జీవితం :** లూకా సువార్త యేసు అపవిత్రాత్మలను, పాపాన్ని, వ్యాధిని జయించాడు. మనుష్యులను పట్టే జాలరులుగా ఉండమని ఆయన తన శిష్యులకు చెప్పాడు. ఆయన ఆత్మీయరాజ్యస్థాపన చేశాడు. కాని రాజకీయంగా రోమీయుల అధికారమే కొనసాగనిచ్చాడు.

**18. సిలువ మరణం :** లూకా 23 యేసు తాను దేవుని కుమారుడనని అన్నాడు గనుక దేవదూషణ చేశాడనే నేరం మీద మతాధికారులు ఆయనను బంధించారు. రోమ సైనికులు ఆయనను సిలువవేశారు. ఆయన మన పాపాల కొరకు మరణించి పాతిపెట్టబడ్డాడు.






**19. పునరుత్థానం :** లూకా 24. మూడవనాడు యేసు మరణం నుండి తిరిగి లేచాడు. ఎవరైతే పశ్చాత్తాపపడి తన యందు విశ్వాసముంచుతారో వారినందరినీ లేపుతానని వాగ్దానంచేస్తూ క్రొత్తనిబంధనా యుగాన్ని ప్రారంభించాడు.

**20. పరిశుద్ధాత్మ దిగివచ్చుట :** అ॥కా॥ 2. యేసు దేవుని వద్దకు తిరిగి వెళ్ళాడు. మనలో నివసించడానికి ఆయన పరిశుద్ధాత్మున్ని పంపాడు. పెంతెకోస్తు దినాన పరిశుద్ధాత్మను పొందిన వారు తమ తలలమీద అగ్నిజ్వాలలు దిగిరావడం చూశారు.





**21. విశ్వాసాన్ని ప్రచురంచేయుట :** అపొస్తలుల కార్యముల గ్రంథం: విశ్వాసులు పరిశుద్ధాత్మతో నిండి సువార్త ప్రకటించారు. యేసు చెప్పినట్టుగా అది మంచినేలను పడిన విత్తనంవలె ఫలించి అభివృద్ధి పొందింది. యోహాను ప్రకటన గ్రంథాన్ని వ్రాశాడు. ఇది క్రొత్త నిబంధనలో చివరి పుస్తకం చాలా మంది విశ్వాసులు హతసాక్షులుగా మరణించారు.


**బైబిల్‌లోని పుస్తకాలన్నీ వ్రాయబడిన తర్వాత జరిగిన చారిత్రాత్మక సంఘటనలు**



**22. సంఘము మరియు రాజ్యము ఐక్యమగుట** (క్రీ.శ.311) రోమా చక్రవర్తియైన కాన్‌స్టాంటిన్ క్రైస్తవత్వాన్ని చట్టబద్ధం చేశాడు. ఎంతో మంది అన్యులు నిజమైన విశ్వాసం లేకుండానే సంఘంలోకి వచ్చారు.



**23. క్రైస్తవ విశ్వాసం అబద్ధపు బోధనలను ఎదుర్కోవల్సి వచ్చింది :** విశ్వాసులు తాము ఏకీభవించే విషయాలను వ్రాసి ఉంచారు. అపోస్తలుల విశ్వాస ప్రమాణం స్థూలంగా సువార్తను వివరిస్తుంది. నైసిన్ విశ్వాస ప్రమాణం త్రిత్వాన్ని నమ్ముతుంది. (తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు).



**24. రోమా సామ్రాజ్యపతనం :** (6,7 శతాబ్దాలు). అవినీతి, అనైక్యత, మరియు చెడు పరిపాలనవల్ల రోమా సామ్రాజ్యం పతనమైంది. దాని ప్రభావాన్ని కోల్పోయి అంతమొందింది.



**25. రోమా బిషప్పు అవతరణ :** రోమాలోని సంఘం అన్ని సంఘాలపై అధిపత్యం ప్రకటించుకొని "రోమన్ క్యాథలిక్కు సంఘం"గా అవతరించింది. తూర్పు ప్రాంతపు సనాతన సంఘాలు ఈ అధిపత్యాన్ని వ్యతిరేకించారు.



**26. చీకటి యుగం :** (క్రీ.శ. 600–1000) విద్య రానురాను తగ్గిపోయింది. నాయకులు క్రియల ద్వారా వచ్చే రక్షణను బోధించారు. ఐరోపాలో క్రైస్తవ్యం చల్లారిపోయింది. కాని ఆసియాలో వ్యాపించింది.



**27. ఇస్లాముకు వ్యతిరేకంగా దండయాత్రలు :** పవిత్రస్థలాన్ని (ఇశ్రాయేలు దేశం) మరియు ఇతర స్థలాలను ముస్లిం వారి నుండి తిరిగి సంపాదించడానికి ఐరోపా సేనలు ప్రయత్నించాయి.



**28. ప్రొటెస్టెంట్ సంఘం అభివృద్ధి :** (క్రీ.శ. 1500) మార్టిన్ లూథర్ మరియు ఇతరులు బైబిల్‌ను స్థానిక భాషలలోకి తర్జుమాచేశారు. విశ్వాసం ద్వారా వచ్చే రక్షణను బోధించారు. రోమన్ క్యాథలిక్కులు పోప్‌ను ఎదిరించారు.



**29. సౌవార్తీకరణ మేలుకొలుపు :** (క్రీ.శ. 1600–1900) సౌవార్తీకరణను నమ్మేవారు అందరూ తిరిగి జన్మించాలని అన్నారు. తమ హృదయాలలోకి యేసును ఆహ్వానించాలనీ పరిశుద్ధాత్ముడు తమను రూపాంతరమొందించడానికి వీలుగా ఉండాలని బోధించారు.



**30. భూదిగంతములకు సువార్త త్వరగా వ్యాపించుట :** (క్రీ.శ. 1900 నుండి ఇప్పటి వరకు) మిషనెరీలు భూమి మీద ఉన్న ప్రతి స్థలానికి క్రైస్తవ విశ్వాసాన్ని తీసుకొని వెళ్ళారు.



**31. యేసు తిరిగి వచ్చుట :** (ముందుగా చెప్పబడింది : లూకా 21 : ప్రకటన గ్రంథం పరలోకపు బూర శబ్దం వినబడుతుంది. తిరుగుబాటు చేసే వారిని శిక్షించడానికి ఆయన భూమి మీదకు శ్రమలు పంపిస్తాడు. సాతానును నాశనంచేసి మరణించిన వారిని లేపి కొందరిని నిత్య జీవానికి మిగిలిన వారిని తీర్పుకు పంపిస్తాడు.

**ఈ క్రింది సంఘటనలను వరుసగా చెప్పడం అభ్యాసం చేయండి :**

పాఠంలో వివిధ గుర్తులను జ్ఞాపకం చేసుకుంటూ ఒక సంఘటన తర్వాత మరొకటి ఎలా జరిగిందో మననం చేసుకొని సంఘటనలన్నీ వరుసగా చెప్పగలిగే దాకా అభ్యాసం చేయండి. అప్పుడు బైబిల్ అంతా ఒకే విధంగా కనిపిస్తుంది. మీరు ఎవరికైతే బోధిస్తున్నారో కూడా ఈ జాబితాను కంఠస్థం చేసేలా చూడండి.

క్రింది జాబితాలో అంశాలను మననం చేసుకొని సంబంధిత వివరణ గుర్తురాగానే ఆ అంశాన్ని టిక్ చేయాలి.

Copyright © 2003 by Paul-Timothy. May be freely copied. Download from www.Paul-Timothy.net